క్లుప్తంగా

బీఆర్‌టీఎస్ రహదారి పరిశుభ్రతకు ప్రాధాన్యం



చినముషిడివాడలో ఫుట్‌పాత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

పెందుర్తి : బీఆర్‌టీఎస్ రహదారి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు. తక్షణమే బీఆర్‌టీఎస్ రహదారిపై పరిశుభ్రత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కృష్ణానగర్, చినముషిడివాడ, శారదాపీఠం రోడ్డును కమిషనర్ పరిశీలించారు. రోడ్డు మార్జిన్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. కృష్ణానగర్ ఫుట్‌పాత్ వంతెన పాదచారులు నడిచేందుకు ఇబ్బందులు లేకుండా తగిన మరమ్మతులు చేపట్టాలని జెడ్సీ హైమావతికి ఆదేశాలు జారీ చేశారు. శారదాపీఠం రోడ్‌లోని సెంటర్ మీడియన్లలో మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు టెండర్ పిలవాలని సహాయక ఇంజినీర్ సురేష్‌కు సూచించారు. ఫుట్‌పాత్‌ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని చెప్పారు. బీఆర్‌టీఎస్ రహదారిపై బస్టాప్‌లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు చెప్పారు. ప్రైవేటు ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లను తొలగించాలన్నారు. కమిషనర్ వెంట కార్యనిర్వాహక ఇంజినీర్ రమణమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డు విజేతలకు అభినందన

పెందుర్తి : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి కూచిపూడి బృంద నాట్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన పెందుర్తి యూనిక్ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభినందించారు. రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కూచిపూడి కళాకారులు నీలిమ, తన్విసాయి, నిత్యశ్రీ, ఆదిత్య, నిచ్చితశ్రీ, ఐశ్వర్య, అమృత గౌరీసాయిలను, నాట్య గురువు శోభారాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోనేటి ఆదినారాయణ, సిబ్బంది హరి, విశాల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెందుర్తి : నరవలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని నరవ, ఎంజీఆర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం నరవ, జెర్రిపోతులపాలెం, చింతగట్ల, ఇప్పిలివానిపాలెం, నందవరపువానిపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. **రాంపురం ఫీడర్ పరిధిలో:** ప్రసాద్‌నగర్, శ్రమశక్తినగర్ 3,4, ఆఖరి బస్టాప్, బంగారమ్మ కాలనీ, సత్యనగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని ప్రకటించారు.

రిషికకు ఘన సత్కారం



విద్యార్థిని రిషికను సత్కరిస్తున్న జేసీఐ వైజాగ్ సభ్యులు

తాటిచెట్లపాలెం: ఇటీవల ఢిల్లీలో జరిగిన కళా ఉత్సవ్‌లో కేంద్రీయ విద్యాలయం వాల్తేర్ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన 10వ తరగతి విద్యార్థిని జి.రిషికను గురువారం విద్యాలయంలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆఫ్ వైజాగ్ (జేసీఐ వైజాగ్) సభ్యులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చదువుతోపాటు ప్రత్యేక కార్యక్రమాల్లో శిక్షణ పొంది రాణించాలని సభ్యులు ఆకాంక్షించారు. రిషికతో పాటు కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, మ్యూజిక్ టీచర్ డాక్టర్ త్యాగరాజ్‌లను వీరు సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు ప్రభాకర్, ఛరిష్మ, కావ్య, కుందన్‌లాల్, నాగమణి, ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ, సీనియర్ ఉపాధ్యాయిని రేఖ తదితరులు పాల్గొన్నారు.



- గొల్లలపాలెం-దువ్వాడ రోడ్డు విస్తరణతో ఇక ప్రయాణాలు సుఖవంతం
- రూ.7.75 కోట్ల నిధులతో శరవేగంగా పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రహదారికి మహర్దశ



నంగినారపాడు సమీపంలో రెండు వరసల రహదారిగా విస్తరిస్తున్న బీటీ రోడ్డు



వెదుళ్లనరవ సమీపంలో పూర్తి కావచ్చిన రెండు వరసల బీటీ రోడ్డు

సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ పరిధిలోని వెదుళ్లనరవ, నంగినరపాడు మీదుగా వెళ్లే గొల్లలపాలెం-దువ్వాడ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. దీంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. సుమారు రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేయనున్న ఈ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును 3.5 కిలోమీటర్ల మేర 2 వరసల రహదారిగా విస్తరించనున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులకు అక్టోబర్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో పాటు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి వెదుళ్లనరవలో శంకుస్థాపన చేశారు.

రోడ్డు విస్తరణ ఇలా..

జీవీఎంసీ పరిధిలోని నంగినారపాడు, వెదుళ్లనరవ మీ దుగా 3.5 కిలోమీటర్ల పొడవున విస్తరించనున్న ఈ రోడ్డుకు సంబంధించి 4 ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. వీటిలో ప్యాకేజీ-1 రూ.1.99 కోట్లతో కొత్తూరు నుండి వెదుళ్లనరవ వరకూ, ప్యాకేజీ-2లో రూ.1.99 కోట్లతో వెదుళ్లనరవ నుండి వెల్ఫేర్ ఫెయిత్ హాస్టల్ వరకూ, ప్యాకేజీ-3లో రూ.1.99 కోట్లతో వెల్ఫేర్ ఫెయిత్ హాస్టల్ నుండి నంగినారపాడు వరకూ, ప్యాకేజీ-4లో రూ.1.78 కోట్లతో నంగినారపాడు నుండి నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ విస్తరించనున్నారు. ఇప్పటికే మొదటి 3 ప్యాకేజీలలోని విస్తరణ పనులు తుది దశకు చేరుకోగా 4వ ప్యాకేజీలోని పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డులో 9 కల్వర్టులు, ఒక మేజర్ బ్రిడ్జితో రెండు వరసల రహదారిగా విస్తరించనున్నారు.

స్థానికుల హర్షం..

ఈ రోడ్డు విస్తరణతో సబ్బవరం నుండి గొల్లలపాలెం మీదుగా దువ్వాడ పోయేందుకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. సబ్బవరం వైపు నుండి గొల్లలపాలెం, నంగినారపాడు, అజనగిరి, వెదుళ్లనరవ, కొత్తూరు, దువ్వాడ మీదుగా ఈ రోడ్డు సాగుతుంది. విశాఖ పారిశ్రామిక ప్రాంతంతో పాటు గాజువాక వైపు వెళ్లే వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నంగినారపాడులో శరవేగంగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

ఇక ప్రయాణాలు సుఖవంతం..



నిత్యం రద్దీగా ఉండే నంగినారపాడు-వెదుళ్లనరవ రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు విస్తరణతో ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. గతంలో ఈ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో తరుచూ ప్రమాదాలు సంభవించేవి. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణతో మా చిరకాల వాంఛ నెరవేరనుంది. స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– సర్వసిద్ధి బోరయ్య, వెదుళ్లనరవ, సబ్బవరం మండలం

ఇరుకు రోడ్డుతో ఇబ్బంది పడేవాళ్లం..



ఇరుగ్గా ఉండే ఈ రోడ్డుతో అనేక ఇబ్బందులు పడేవాళ్లం. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు విస్తరణకు అనేక సార్లు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల వద్ద విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. ఇప్పుడు విస్తరణ పనులు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు, బ్రిడ్జిల నిర్మాణం చురుగ్గా సాగుతోంది.

– బొట్టా ముత్యాలు, వెదుళ్లనరవ, సబ్బవరం మండలం

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

సబ్బవరం : మండలంలోని జోడుగుల్లుకు చెందిన శ్రీబంగారుతల్లి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి స్థానికుల నుండి అనూహ్య స్పందన లభించింది. రోటరీ బ్లడ్ బ్యాంకు, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 140 మంది రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. సుమారు 116 మంది నుండి 116 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. తానుబిల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శంకర్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు బంగారుతల్లి సేవా సమితి సభ్యుడు సింగంపల్లి వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకర్ నాయుడిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఈ సేవా సంఘం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలతో పాటు కష్టంలో ఉన్న ఎంతో మందిని ఆదుకున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికలు అందచేశారు.

విద్యార్థులకు నాంది ఫౌండేషన్ వితరణ



విద్యార్థులకు బ్యాగ్‌లు అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ సంస్థ వితరణ చేసింది. మొత్తం 30 మంది విద్యార్థులకు బ్యాగ్‌లు, ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్ సమకూర్చింది. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా వాటిని అందించారు. హెచ్‌ఎం బి.టి మూర్తి, నాంది సంస్థ ప్రతినిధి సంతోషి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ స్వాతి, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఓరియంటేషన్ కోర్సులకు ప్రాధాన్యం

సింహాచలం : జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి కళాశాలలో జాబ్ ఓరియంటేషన్ కోర్సులకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నట్లు అడ్మిన్ అండ్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ తెలిపారు. ఆస్పత్రికి చెందిన కళాశాలలో బీఎస్సీ ఆప్టోమెట్రీ కోర్సుని విజయవంతంగా పూర్తి చేసి ఇంటర్న్‌షిప్ చేసిన పలువురు విద్యార్థులను పర్మినెంట్ ఉద్యోగాల్లో నియమించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ కళాశాల ద్వారా బీఎస్సీ ఆప్టోమెట్రీ కోర్సును విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆఫ్ ఆప్టోమెట్రీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల్లో అందిస్తున్న ఆప్టోమెట్రీలో డిగ్రీ, డిప్లొమా కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీజీఎం వి.రమేష్‌కుమార్, మేనేజర్ ఎం. శివప్రసాద్, సీనియర్ మేనేజర్ కె.వినోద్‌కుమార్, అధ్యాపకురాలు అలేఖ్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.



పర్మినెంట్ ఉద్యోగాల్లో చేరిన విద్యార్థులతో జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్ తదితరులు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజతో పాటు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి

- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

మహారాణిపేట : సాగుకు అవసరమైన రుణాలు అందించి రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ మద్దిపాలెంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 2024-25 వార్షిక బడ్జెట్‌పై సభ్యుల సమక్షంలో పూర్తి స్థాయిలో చర్చించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో బ్యాంక్ బ్రాంచిల ద్వారా అమలు చేస్తున్న కార్యకలాపాలను బ్యాంక్ సీఈవో డీవీఎస్ వర్మ మహాజన సభ ముందుంచారు. డిసెంబర్ మాసాంతం వరకూ వచ్చిన ఆదాయ, వ్యయాలపై వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే కార్యకలాపాలు, వాటికి వెచ్చించే బడ్జెట్‌ను తెలియజేశారు. దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ సొసైటీల బలోపేతానికి పీఏసీఎస్ అధ్యక్షులు కృషి చేయాలన్నారు. సొసైటీల ద్వారా ఇచ్చిన రుణాలు సకాలంలో చెల్లించటం ద్వారా ప్రభుత్వం అందించే పలు రాయితీలు వస్తాయని, ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతా సమన్వయంతో పని చేసి బ్యాంకు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. సొసైటీల బలోపేతం, రైతాంగానికి అందించాల్సిన మరింత సాయంపై పలువురు సభ్యులు సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వంచే కొత్తగా నామినేట్ అయిన చైర్మన్లను కోలా గురువులు ఘనంగా సన్మానించారు. సభ్యుల సహకారంతో సొసైటీల అభివృద్ధికి పని చేయాలని కోరారు. మహాజన సభలో కేంద్ర సహకార బ్యాంకు సీఈవో వర్మ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

నేడు గోవా గవర్నర్ రాక

మహారాణిపేట: గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లాయ్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. కొద్ది సేపు విశ్రాంతి అనంతరం భోగాపురంలో ఉన్న సన్ రే రిసార్ట్స్‌కు వెళతారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో అనంతరం తిరిగి విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 4.15గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ అప్పలనరసింహ కాలనీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో స్థానికులు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి, ఎముకలు, జనరల్ ఫిజీషియన్, తదితర విభాగాల వైద్యులు శిబిరంలో వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. శిబిరానికి వచ్చిన వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. సచివాలయ వైద్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ప్రజలకు సహకారం అందించారు. ల్యాబ్ టెక్నీషియన్ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. చంద్రనగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి వికాశ్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

4,157 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గురువారం అర్బన్ పరిధిలో 10 ప్రాంతాల్లో జరిగాయి. సాగర్‌నగర్, ఎంఎస్‌ఆర్ లేఅవుట్, ఎన్‌జీజీవో కాలనీ, భీమనగర్‌లో రెండు చోట్ల, రైల్వే న్యూకాలనీ, అంబేడ్కర్ కాలనీ, పెదగంట్యాడ, సిద్ధేశ్వరం, చంద్రనగర్, తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ శిబిరాల్లో మొత్తం 4,157 మందికి వైద్య సేవలు అందజేశారు. వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- వేడుకగా స్వర్ణపుష్పార్చన
- ఘనంగా నిత్యకల్యాణం



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



నిత్య కల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

కనులపండువగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా బంగారమ్మ, కుంచాలమ్మ తీర్థం

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెంలో కొలువైన శ్రీబంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధనా కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న వారిలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి చైతన్య, ఉత్సవ కమిటీ సభ్యులు గండి దేముడు, కె.వి. రమణ, త్రిమూర్తులు, గొర్లి కృష్ణ తదితరులు ఉన్నారు.



అన్నసమారాధనలో పాల్గొన్న గ్రామస్తులు

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

పెందుర్తి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగం పదవుల నియామకాల్లో పెందుర్తి నియోజకవర్గానికి తగిన ప్రాధాన్యత లభించింది. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం విడుదల చేసిన వివిధ విభాగాల్లో పార్టీ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించింది. పార్టీ యువజన విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా పాలిశెట్టి సురేష్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా పెదిశెట్టి శేఖర్, కార్యదర్శులుగా సేనాపతి దుర్గాఅప్పారావు, బండారు శ్రవణ్ కుమార్, ఎంఎస్ పాత్రుడు, వైఎస్ఆర్‌టీయూసీ జనరల్ కార్యదర్శిగా బొద్దపు చిన్నారావు, కార్యదర్శిగా గాలి చరణ్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా పైల పైడినాయుడు, క్రిస్టియన్ మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కార్యదర్శులు జాన్ డేవిడ్ గాస్య, వీరభద్రుడు కాయిపా, సంయుక్త కార్యదర్శిగా డేవిడ్ రాజ్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా సూరిశెట్టి నూకరత్నం, సంయుక్త కార్యదర్శిగా గిద్దపు పద్మావతి, బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కిల్లి దేముడు, కార్యదర్శులుగా బంధం నాగేశ్వరరావు, పల్లా చిన్నారావు, సంయుక్త కార్యదర్శులుగా బొండు అచ్చిబాబు, బీశెట్టి వెంకటరావు, పంచాయితీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పైలా వెంకట పద్మలక్ష్మి, రైతు విభాగం కార్యదర్శిగా మామిడి బంగారునాయుడు, సంయుక్త కార్యదర్శిగా బండారు కృష్ణబాబు, క్రియాశీల సభ్యుడిగా మల్ల జగదీష్, ఎస్‌సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కొమ్ము కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా సీర శివ, కార్యదర్శులుగా కొప్పుల జగదీష్, వంగలపూడి గణేష్, సంయుక్త కార్యదర్శులుగా ముదపాక శివ, మారుడిపూడి వినోద్‌కుమార్, వాణిజ్య విభాగం కార్యదర్శిగా తీగల మురళి, సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీను, కార్యదర్శులుగా టి.గోవిందం, ఓమ్మి కుంచబాబు, సంయుక్త కార్యదర్శులుగా నందవరపు శ్రీనివాసరావు, అవగడ్డ శ్రీనివాసరావు, టి.వినోద్‌ను నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

మగ్గం వర్క్‌పై మహిళలకు ఉచిత శిక్షణ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామంలో గల సామాజిక భవనం వద్ద మగ్గం వర్క్‌పై స్థానిక మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు గురువారం ఉదయం ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా లక్క లెర్నింగ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రామంలో సుమారు 32 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై నేటి నుంచి ఉచిత శిక్షణ అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ఉన్నతాధికారులు కె.శ్రీకాంత్, ఎస్.వెంకటరమణ, ములగాడ గ్రామ పెద్దలు ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి, గురుబిల్లి రామచంద్రరెడ్డి, పట్నాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోరమాండల్ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు

రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన

కంచరపాలెం: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ, ఎన్‌సీసీ యూనిట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం పాత ఐటీఐ జంక్షన్‌లోని పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ) కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఆర్.సి.హెచ్.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఐ.రఘుబాబులు మాట్లాడుతూ భద్రతా నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం వాకథాన్ నిర్వహించారు. రోడ్డు భద్రతా నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి గణేష్‌రెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ యు.ఉమాశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారి